# పునాది

ఇంటిపన్ను ఐదేళ్ళ కోసారి అసెస్ చేసుంటారు మునిసిపల్ కార్పొరేషన్ ఉద్యోగస్తులు. ఆ రోజు కార్పొరేషన్‌నుంచి టేక్స్ ఇన్‌స్పెక్టర్ వచ్చి ఇంటిలో వున్న ప్రతి వాళ్ళను అడిగాడు.

"మీరు ఈ ఇంట్లో అద్దెకుంటున్నారా అని. మా అన్నయ్య, చెల్లెలు, అమ్మ, నాన్న, బావ అంతా మా కుటుంబ సభ్యులంటే నమ్మ లేదు.

ఇల్లంతా చూసి చెప్పాడు.

"ఆర్నెలకి వెయ్యిరూపాయలు టేక్స్"

"ఒకేసారి డబల్ చేసేసారే!" అడిగాను.

"రూల్. అంతే" చెప్పాడు

"మీ జీతం ఎంత?" అడిగాను.

చెప్పాడు.

ఆశ్చర్యంవేసింది, అంతతక్కువ జీతగాడికి అందరిళ్ళ పన్నులని నిర్ణయించే హక్కు ఎలా ఇచ్చారా అని.

గొంతు తగ్గించి చెప్పాడు.

"నాకో పదిహేను వందలు ఇస్తే ఆర్నెలకు ఆరు వందలు చేస్తాను"

"అసలు ఏ బేసిస్‌మీద మీరు టేక్స్ నిర్ణయిస్తున్నారు?" అడిగాను.

"ఇంత పెద్ద ఇల్లు, వెయ్యి తక్కువే"

ఇంటి వైశాల్యాన్నిబట్టి ఫలానా లొకాలిటీలో చదరపు అడుగుకి ఇంత అని ప్రభుత్వం టేక్స్ రేటుని నిర్ణయిస్తే ఇలా లంచం వసూలు చేసే అవకాశం వుండదనిపించింది నాకు. అందులో కొత్త ప్రభుత్వ ముఖ్య

మంత్రి లాల్‌బహదూర్ స్టేడియంలో "లంచకొండులారా మీ కిదే తుది హెచ్చరిక చేస్తున్నాను" అని ఆవేశంగా హెచ్చరించినప్పుడు నేను అక్కడే వున్నాను.

"మొత్తం నాకు రాదు. మా సర్కిల్‌లో చాలామంది పంచుకోవాలి. నాకొచ్చేది తక్కువే" చెప్పాడు టేక్స్ఇన్‌స్పెక్టర్ నేను ఆలోచనలో పడటం గమనించి.

నేను ఆ సర్కిలులోకి వెళ్ళి సర్కిల్ హెడ్‌కి ఫిర్యాదు చేసాను. టేక్స్ ఇన్‌స్పెక్టర్ లంచం అడుగుతున్నాడని.

ఆయన నావంక ఎగాదిగా చూసి అర్జునుడికి శ్రీకృష్ణుడు వుపదేశించిన గీతలాంటిది నాకు వినిపించాడు.

"మీరు అది ఇవ్వలేదనుకోండి ఆర్నెలకి వెయ్యిచొప్పున ఐదు సంవత్సరాలకి పదివేలు కట్టాలా! ఇచ్చేస్తే ఆర్నెల్లకి నాలుగువందల చొప్పున ఐదేళ్ళలో ఆదా చేస్తున్నట్లేగా. ఆలోచించండి. నాలుగు వేలలో పదిహేను వందలు పోతే రెండున్నరవేలు మీకు లాభం కలిగిస్తోంది మా డిపార్టుమెంట్"

సర్కిలు హెడ్ పై అధికారి మునిసిపల్ కార్పొరేషన్ కమీషనర్ దగ్గరకి వెళ్ళాను. జరిగింది వివరించాను.

"మీది ఏ ఏరియా? అద్దె ఎంత వస్తుంది?" వగైరాలన్నీ అడిగి వెయ్యి చాలా తక్కువని, పదిహేను వందలు చేస్తున్నానని కాగితంమీద రెండువేలు రాసి "అంత ఇస్తే వెయ్యితోనే సరిపెడతాను" అన్నాడు.

మళ్ళీ ముఖ్యమంత్రి హామీ గురించి చెప్పాను. చిన్నగా నవ్వి చెప్పాడు.

"నేను నెలకింతని మా స్పెషల్ ఆఫీసర్‌కి డబ్బు పంపిస్తుండాలి. అది వేలల్లో వుంటుందని తెలుసా? ఆ డబ్బు ఎక్కడనుంచి తేవాలి?" నిలదీసాడు.

సరాసరి స్పెషల్ ఆఫీసర్ దగ్గరికి వెళ్ళాను. ఆయన క్లాస్‌వన్ ఆఫీసర్ కాబట్టి లేకిగా ప్రవర్తించడని, నాకు న్యాయం జరుగుతుందని భావించాను.

ఆయన పి ఏ నేను వచ్చిన పని తెలుసుకుని, ఇలాంటి సర్కిల్ వ్యవహారల్లో ఆయన జోక్యం చేసుకోడని చెప్పింది. ఆ సర్కిల్ ఆయన పరిధిలో వుందని, నేను చూసిగాని కదలనని మొండికేయడంతో నన్ను లోపలికి పంపించింది విధిలేక.

తీరా చూస్తే ఆయన నాకు పరిచయస్థుడే. చాలా సభలలో మాట్లాడటానికి వస్తుంటాడు. నా బాధ చెప్పుకున్నాను.

"ఐ యామ్ సారీ. నేను వాళ్ళను లంచం తీసుకోవద్దని శాసించలేను. నా మాట వినరు. అంతేకాక నెలనెలా నేను ఇలా కొంత డబ్బు పోగుచేసి మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ సెక్రటరీకి ఇవ్వాల్సి వుంటుంది. లేకపోతే నాకు బదిలీ తప్పదు" చెప్పాడు.

ఆ సెక్రటరీ ఎవడో, ఎక్కడుంటాడో కనుక్కుని సెక్రటేరియెట్‌లో ఆయన్ని పట్టుకుని ముఖ్యమంత్రి హామీగురించి చెప్పి, నాకు లంచగొండి రాష్ట్రోద్యోగులవల్ల కలిగే ఇబ్బందిని వివరించాను.

"నా దగ్గరకు ఇలా చాలామంది వస్తుంటారు. నా చేతిలో శక్తి వున్నా అందరికీ శిక్ష తగిస్తూంటే నేను నెలనెలా మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ మంత్రికి ఇవ్వాల్సిన మామూలు ఎలా సేకరించను? సారీ మీరు అక్కడ లంచం ఇవ్వక తప్పదు, నేనిక్కడ ఇవ్వాల్సినంత కాలం"

నాకు వీరావేశం వచ్చి ఆ మంత్రి ఛేంబర్‌లోకి అడ్డుపడే జవాన్లని తోసుకుని వెళ్ళి జరిగిందంతా చెప్పాను. ఆయన శాంతముగా విన్నాడు.

"మన ముఖ్యమంత్రి పదవీ స్వీకార ప్రమాణంనాడు హామీ ఇచ్చారు లంచగొండితనం రూపుమాపుతానని, ఆయన కేబినెట్‌లో వుంటూ మీరు ఇలా లంచగొండితనంతో ప్రవర్తించడం ఆయన దృష్టికి ఇప్పుడే తీసుకెళతాను"

ఆయన చిరుమందహాసంతో ఒక అంకె చెప్పాడు  అది పదుల లక్షలలో వుంది

"నేను ఈ కేబినెట్‌లో వుండాలనుకుంటే దీన్ని నేను నెలనెలా ఎవరికివ్వాలో తెలుసా?"

ఎవరికివ్వాలో చెప్పాడు.

ఎవరో మీ వూహకే వదిలేస్తాను.

# కొత్త రకం అభ్యర్థి

కృపాల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫిల్మ్ ఏక్టింగ్‌ని హైదరాబాద్‌లో రెండెకరాల స్థలంలో తెరచి రెండు సంవత్సరాలు దాటుతోంది. ఇంతదాకా రెండు బేచ్‌లు విజయవంతంగా కోర్సులను పూరిచేశారు. ఈ మధ్య నటనే కాక, దర్శకత్వం కెమేరా, స్క్రీన్‌ప్లే మొదలయిన ఇతర విభాగాలు కూడా యేర్పాటుచేశారు.

ఆ ఇన్‌స్టిట్యూట్‌లో శిక్షణ ఎంతో సమర్థవంతముగా వుంటుందన్న సంగతి తెలుగు సినిమా పరిశ్రమ వారికేకాక ప్రజలకు, ప్రేక్షకులకుకూడా తెలిసింది.

అందులో శిక్షణ పొందినవారిలో అధికశాతం చలనచిత్ర రంగానికి వెళ్ళారు వారి నటన ప్రజలను ఎంతో ముగ్ధులను చేసింది. అవకాశం వచ్చినప్పుడల్లా ఆ నటీనటులంతా తామిలా నటించడానికి కృపాల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫిలిం ఏక్టింగ్‌లో దాని ప్రిన్సిపాల్ కృపాల్ ఇచ్చిన శిక్షణాఫలితమే అని బాహాటంగా చెప్పటంతో అందరి దృష్టి దానిమీద పడింది. కొత్త నటీనటులు కోరే నిర్మాతలు ఆ ఇన్‌స్టిట్యూట్‌లో వారిని తీసుకోడానికి ఆసక్తి చూపించడమే కాక పోటీపడసాగారు కూడా.